క్లుప్తంగా

రజతోత్సవ సభ విజయవంతం

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి



పద్మారెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: రజతోత్సవ సభకు అశేష ప్రజలు తరలివచ్చి విజయవంతం చేశారని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి పేర్కొన్నారు. జిల్లా నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన పార్టీ శ్రేణులకు, నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎల్కతుర్తిలో జరిగిన సభలో మాజీ సీఎం కేసీఆర్ కార్యకర్తలకు, నాయకులకు, ప్రజలకు మంచి సందేశం, ధైర్యాన్ని కల్పిస్తూ ప్రసంగాన్ని కొనసాగిందన్నారు. ఈ ఉత్సాహంతో రాబోయే కాలంలో మన పార్టీని అధికారంలోకి తీసుకోవచ్చేలా కృషి చేయాలని కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు.

లయన్ సభ్యుడికి అంతర్జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న రాజశేఖర్‌రెడ్డి

రామాయంపేట(మెదక్): లయన్స్ క్లబ్ సభ్యుడు రాజశేఖర్‌రెడ్డికి అంతర్జాతీయ అవార్డు లభించింది. రక్త, అవయవ దానాలు, ప్రజలను చైతన్యపర్చడం, వైద్య శిబిరాల నిర్వహణ వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండున అవార్డు వరించింది. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లోని పుష్ప కన్వెన్షన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బాబూరావు, సునీల్‌కుమార్ చేతుల మీదుగా రాజశేఖర్‌రెడ్డి అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు రాజశేఖర్‌రెడ్డిని ప్రశంసించారు. కార్యక్రమంలో స్థానిక క్లబ్‌తో పాటు జిల్లా పరిధిలోని ఇతర క్లబ్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ప్రారంభం



విగ్రహాలను ఊరేగిస్తున్న గ్రామస్తులు

టేక్మాల్, (మెదక్): టేక్మాల్ మండలం బొడ్మట్‌పల్లి గౌడసంఘం ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం పందిరి వేసి విగ్రహాలను ప్రత్యేక పూజలతో ఊరేగించారు. ఉత్సవాల్లో భాగంగా గణపతిపూజ, పుణ్యవచనం, బజారుహనం, జలాధివాసం, మండపారాధన, దేవత అర్చన గణపతి దేవతల భవనం వంటి ప్రత్యేక పూజలను నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.

రైతులను ఇబ్బందులు గురి చేయొద్దు

ఆర్డీఓ జయచంద్రారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ

తూప్రాన్: ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దని ఆర్డీఓ జయచంద్రారెడ్డి అన్నారు. సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని రైస్ మిల్లర్లు, వరి కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, ఐకేపీ, పీఏసీఎస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ధాన్యం కొనుగోళ్లు ఇంకా మొదలుకాని పీపీసీ కేంద్రాల్లో తక్షణమే మొదలు పెట్టాలని ఆదేశించారు. కొనుగోలు అయిన వెంటనే ట్యాబ్ ఎంట్రీ చేసి లారీల్లో రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. ఈ సమావేశంలో డివిజన్‌లోని తహసీల్దార్లు ఐకేపీ, సింగిల్ విండో సొసైటీ సీఈవోలు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత



కార్మికులకు నగదు అందజేస్తున్న వెంకట్‌రామిరెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి గుండ్లపల్లి పంచాయతీ కార్మికులకు పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి సోమవారం నిత్యావసర సరుకులు అందజేశారు. అలాగే ఒక్కొక్క కార్మికుడికి రూ.2వేలు చొప్పున అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కృష్ణయ్య, షఫియొద్దీన్, శ్రీనివాస్‌రెడ్డి, దుర్గారెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో చోరీలు.. తస్మాత్ జాగ్రత్త!



ఇంటి పరిసరాల్లో సీసీల ఏర్పాటు ఉత్తమం

- అనుమానిత వ్యక్తుల కదలికలపై అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి



మెదక్ మున్సిపాలిటీ: వేసవి కాలం దొంగలతో జాగ్రత్తగా ఉండాలని, ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకోవడం శ్రేయస్కరమని జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి తెలిపారు. జిల్లా ప్రధాన పోలీసు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులు ప్రారంభం అయ్యాయని, వివాహాలు, స్నేహితులతో ఫ్యామిలీ మెంబర్స్‌తో అంతా టూర్స్ ప్లాన్ చేస్తూ ఉంటారు. ఇదే అదునుగా దొంగతనాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉందని జిల్లా ప్రజలు కూడా ఈ విషయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు.

దొంగతనాల నియంత్రణకు కొన్ని సూచనలు..

- ఇంటి బయట, డాబాలపై పడుకునేవారు మెడలో నగలను జాగ్రత్తగా పెట్టుకోండి. ఇంటిలో బంగారు ఆభరణాలు ఉంచొద్దు.
- బస్సు ప్రయాణాల్లో బ్యాగ్‌ను మీ దగ్గరపెట్టుకోండి. గుర్తు తెలియని వ్యక్తులు తిను బండారాలు, కూల్ డ్రింక్స్ లాంటివి ఇస్తే తీసుకోవద్దు.
- ఊరికి వెళ్లే సమయంలో వీలైనంత మేరకు ఇంట్లో విలువైన వస్తువులు, నగదు, బంగారం ఆభరణాలు ఉంచొద్దు. వాటిని బ్యాంకు లాకర్లో లేదా భద్రంగా ఉన్న చోట దాయాలి.
- బీరువా తాళం చెవిని బీరువాపై కానీ, బట్టల కింద కానీ, ఇంట్లో కానీ పెట్టి వెళ్లవద్దు.
- ఇంటి ముందు తలుపులకు సెంటర్ లాక్ వేయండి.
- ఇళ్లకు నాసిరకం తాళాలు వాడొద్దు, తాళం కనపడకుండా కర్టెన్‌తో కవర్ చేయాలి.
- ఇంటి ముందు చెప్పులు ఉంచండి.
- బయట గేటుకు లోపల నుంచి తాళం వేయండి.
- బయటకు వెళ్లేటప్పుడు ఇంట్లో, బయట లైట్ వేసి ఉంచండి.
- పేపర్ బాయ్, పాలు వేసే వాళ్లకు రావద్దని చెప్పండి.
- నమ్మకమైన వాచ్‌మెన్‌లను మాత్రమే నియమించుకోండి.
- ఊరికి వెళ్లేటప్పుడు మీకు నమ్మకమైన వారికి అలాగే స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వండి.
- బయటకు వెళ్లేటప్పుడు, వాకిట్లో ముగ్గులు వేసేటప్పుడు మెడలోని బంగారు నగలు జాగ్రత్త. వీలైతే చీర కొంగుతో కవర్ చేసుకుంటే మంచిది.
- కాలనీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే దొంగలు భయపడే అవకాశం ఉంది. భద్రత ఎక్కువగా ఉంటుంది.
- మీ మీ ఇళ్లలో సీసీలు ఏర్పాటు చేసుకోవాలి. మొబైల్ యాప్ ద్వారా సీసీ దృశ్యాలు ఎప్పటికప్పుడు వీక్షించే అవకాశం ఉంటుంది.
- బయటికి వెళ్లే విషయాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సోషల్ మీడియాలో షేర్ చేయొద్దు.
- మీకు ఎవరిమీదైనా అనుమానం వస్తే వెంటనే డయల్ 100కు కాల్ చేయండి.



బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు

జమ్లానాయక్ తండాలో తల్లిదండ్రులకు కౌన్సిలింగ్



తల్లిదండ్రుల నుంచి హామీ పత్రాలు తీసుకుంటున్న అధికారులు

పెద్దశంకరంపేట(మెదక్): బాల్య వివాహాలను చేస్తే కఠిన చర్యలు తప్పవని ఇంటిగ్రేటెడ్ చైల్డ్ ప్రొటెక్షన్ సర్వీస్(ఐసీపీఎస్) అధికారులు నాగరాజుగౌడ్, శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం పెద్దశంకరంపేట మండలం జమ్లానాయక్ తండాకు చెందిన పాత్‌లోత్ గోపాల్, శాంతికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తె మైనర్(13) కాగా ఇటీవల పాపన్నపేట మండలానికి చెందిన యువకుడితో నిశ్చితార్థం చేశారు. కొద్దిరోజుల్లో పెళ్లి ఉండగా, బాల్య వివాహం చేస్తున్నట్లు కొందరు 1098కి సమాచారం అందించారు. దీంతో అధికారులు తండాలో వివరాలు సేకరించి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఆడపిల్లలకు 18 ఏళ్లు నిండే వరకు వివాహం చేయొద్దని, నిబంధనలు అతిక్రమిస్తే, దీనికి సహకరించే వారందరిపై కేసులు నమోదవుతాయని హెచ్చరించారు. వివాహం జరపమని తల్లిదండ్రుల నుంచి హామీ పత్రాన్ని రాయించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శివకుమార్, పంచాయితీ కార్యదర్శి పాషా, అంగన్‌వాడీ టీచర్ పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ నుంచి వెల్దుర్తి వరకు బస్సులు నడపాలి

డీఎంకు వినతిపత్రం అందజేత



డీఎంకు వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాస్‌గౌడ్

వెల్దుర్తి(తూప్రాన్): మేడ్చల్ నుంచి తూప్రాన్ మీదుగా వెల్దుర్తి వరకు ఆర్టీసీ బస్సు సర్వీసులు నడపాలని మేడ్చల్ డిపో మేనేజర్‌కు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ సోమవారం వినతి పత్రం అందజేశారు. గతంలోనూ మెదక్ ఎంపీ రఘునందన్‌రావు లెటర్ ప్యాడ్‌పై వెల్దుర్తి నుంచి సికింద్రాబాద్ వరకు బస్సులు నడపాలని డీఎంను కోరినట్లు గుర్తు చేశారు. వెల్దుర్తి మండల కేంద్రం నుంచి రోజూ పదుల సంఖ్యలో హైదరాబాద్‌కు వెళ్తుంటారని వారిని దృష్టిలో ఉంచుకొని బస్సు సర్వీసులు నడపాలని కోరారు. సమస్యపై డీఎం సానుకూలంగా స్పందించారని, రెండు, మూడు రోజుల్లో బస్సు సర్వీసు నడిచేలా చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారని శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

అల్లాదుర్గం(మెదక్): పదో తరగతి పూర్వవిద్యార్థులు 21యేళ్ల అనంతరం కలుసుకొని సందడి చేశారు. మండల పరిధిలోని చిల్వెర జిల్లా పరిషత్ పాఠశాలలో 2003–04లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులంతా సోమవారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి మధుర స్మృతులను గుర్తుచేసుకొన్నారు.

అందరికీ ధన్యవాదాలు

– ఎమ్మెల్యే సునీతారెడ్డి



ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: వరంగల్ సభకు తరలివచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే సునీతారెడ్డి ధన్యవాదాలు తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఆదివారం వరంగల్ ఎల్కతుర్తిలో జరిగిన బీఆర్ఎస్ 25ఏళ్ల రజతోత్సవ సభకు రావాలని పిలుపునివ్వగానే నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు సభకు తరలి వచ్చి విజయవంతం చేసినందుకు ధన్యవాదాలని చెప్పారు. తమ పార్టీకి కార్యకర్తలే బలమని, అన్ని గ్రామాలలో తమకు కార్యకర్తల బలం ఉందన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు

– ఎంపీడీఓ శ్రీనివాస్



లబ్ధిదారుల ఇంటిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుందని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం మండలంలోని మహమ్మద్ నగర్, కొత్తచెరువు తండా, మర్రిచెట్టు తండా, ధర్మాసాగర్ గ్రామాల్లో లబ్ధిదారుల ఇళ్లను పరిశీలించి విచారణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానికంగా ఉంటూ పూరిగుడిసెలు, కిరాయి ఇంటిలో ఉండే నిరుపేదలకు మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఎంపిక చేసిన లబ్ధిదారుల వివరాలను పరిశీలించినట్లు తెలిపారు. నిబంధనల ప్రకారం ఇల్లు మంజూరైన లబ్ధిదారులు 400 నుంచి 500 ఫీట్లలోపు మాత్రమే ఇల్లు నిర్మించుకోవాలన్నారు. అంతకన్నా ఎక్కువ స్థలంలో నిర్మిస్తే నిధులు మంజూరుకావని చెప్పారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీల కార్యదర్శులు ప్రసాద్, నరహరి, సిరాజొద్దీన్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు రఘు, బాలాగౌడ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో నాగశృతి ప్రతిభ



నాగశృతి వేసిన వేంకటేశ్వరస్వామి పద్మావతి పేయింటింగ్

చేగుంట(తూప్రాన్): జీవకళ ఉట్టి పడేలా ఎంబాస్‌డ్ పేయింటింగ్ (చిత్రలేఖనం) వేసి నాగశృతి ప్రతిభ చాటారు. చేగుంటకు చెందిన గడ్డం సత్యనారాయణ మల్కాజిగిరి డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్నారు. అతని పెద్ద కూతరు నాగశృతి బీటెక్ పూర్తి చేసి టెక్ మహీంద్రలో ఉద్యోగం చేస్తున్నారు. చిత్ర లేఖనంపై ఉన్న ఆసక్తితో ఖాళీ సమయంలో చిత్రాలను గీస్తూ ప్రావిణ్యం సాధించారు. తాంజావూరు నుంచి తెప్పించిన అమెరికన్ డైమాండ్‌తో పాటు ఇతర ముడి సరుకులతో వేంకటేశ్వర స్వామి పద్మావతిల అద్భుతమైన చిత్రాన్ని రూపొందించారు. చిత్రం తయారు చేయడానికి మూడు నెలల సమయం పట్టిందని, ఈచిత్రానికి మార్కెట్‌లో రూ.5లక్షల నుంచి ఆరు లక్షల వరకు విలువ ఉంటుందని నాగశృతి తెలిపారు. అక్షయ తృతీయ రోజున స్వచ్ఛంద సంస్థకు ఉచితంగా అందజేయనున్నట్లు నాగశృతి తెలిపారు.

ఇంటర్ స్టేట్ ర్యాంకర్‌కు సన్మానం



విద్యార్థిని సన్మానిస్తున్న గ్రామస్తులు

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని ఉప్పులింగాపూర్ గ్రామానికి చెందిన శివసాయి మెదక్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పూర్తయ్యింది. ఇటీవల వెలుబడిన ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో 466/470 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో మంచి ర్యాంక్ సాధించాడు. దీంతో సోమవారం గ్రామస్తులు విద్యార్థి శివసాయిని శాలువాతో సత్కరించారు. భవిష్యత్‌లోనూ ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. మహేశ్‌రెడ్డి, సుదర్శన్, కిషన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలి

తహసీల్దార్ మన్నన్



ధరిపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలిస్తున్న తహసీల్దార్ మన్నన్

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ మన్నన్ తనిఖీ చేశారు. సోమవారం చిన్నశంకరంపేట మండల కేంద్రంతో పాటు సూరారం, ధరిపల్లి గ్రామాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వాహకులతో మాట్లాడారు. కాంటా చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని కోరారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీటి సౌకర్యంతో పాటు నీడ కల్పించాలని కోరారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

అల్లాదుర్గం(మెదక్): అర్హులందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని ఎంపీడీఓ చంద్రశేఖర్ చెప్పారు. మండల పరిధిలోని బహిరన్‌దిబ్బ గ్రామంలో జరుగుతున్న లబ్ధిదారుల ఎంపిక సర్వేను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలానికి 400 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, అధికారులు పక్కగా సర్వే చేసి అర్హులను ఎంపిక చేస్తారన్నారు.

సైబర్ నేరస్తులతో అప్రమత్తంగా ఉండాలి



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఏఎస్‌ఐ

అల్లాదుర్గం(మెదక్): సైబర్ నేరగాళ్లతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్‌ఐ దేవిదాస్ అన్నారు. సోమవారం అల్లాదుర్గంలో సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంకు నుంచి మాట్లాడుతున్నా.. మీ ఏటీఎం కార్డు లాక్ అయ్యిందని ఫోన్ చేసి ఓటీపీ నంబర్ చెప్పామంటే చెప్పావద్దని సూచించారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి ఎంతో మంది లక్షల రూపాయలు పోగొట్టుకున్నారని తెలిపారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న రాజిరెడ్డి

నర్సాపూర్: సీఎం సహాయ నిధితో పేదలకు ఎంతో మేలు జరుగుతోందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. సోమవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డితో కలిసి వెల్దుర్తి, కౌడిపల్లి మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందచేశారు. పేదలకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందించేందుకు తన వంతు కృషి చేస్తున్నట్లు ఆయన చెప్పారు. వారి వెంట నాయకులు మహేశ్‌రెడ్డి, శ్రీనివాస్, నరేందర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి కరెంటు మోటార్ అందజేత



గ్రామస్తులకు అందజేసిన మోటార్, పైపులు

రామాయంపేట(మెదక్): సుతారిపల్లిలోని పెద్దమ్మ ఆలయానికి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కరెంటు మోటారు అందజేశారు. ఈమేరకు ఆలయ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం రాత్రి బోనాల ప్రదర్శన నిర్వహించారు. ఉత్సవాల కోసం ఆలయంవద్ద నీటి ఎద్దడి తీర్చడానికి తమ విజ్ఞప్తి మేరకు మైనంపల్లి మోటార్ అందజేశారని గ్రామస్తులు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ **నేడు ఈజీఎస్ ప్రజా దర్బార్**

శివ్వంపేట(నర్సాపూర్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై మంగళవారం ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నాగేశ్వర్ గుప్తా, ఏపీఓ అనిల్‌కుమార్ తెలిపారు. మండలంలో చేపట్టిన కూలి పనులు, మెటీరియల్ పనులపై గ్రామాల్లో సోషల్ ఆడిట్ జరిగిందని దీనిపై మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ప్రజా దర్బార్ జరుగుతుందని చెప్పారు.

◆ **మంత్రి సురేఖకు స్వాగతం**

నర్సాపూర్: జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖకు సోమవారం స్థానిక కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికారు. నియోజకవర్గంలోని హత్నూర మండలంలో పలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు నర్సాపూర్ మీదుగా వెళుతున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి పలువురు నాయకులు స్థానిక ఆర్టీసీ డిపో సమీపంలో జాతీయ రహదారిపై మంత్రికి శాలువాలు కప్పి స్వాగతం పలికారు.

◆ **కల్యాణోత్సవానికి ఆహ్వానం**

పెద్దశంకరంపేట(మెదక్): పెద్దశంకరంపేటలోని శ్రీ గోదా సమేత లక్ష్మీ వేంకటేశ్వరస్వామి వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించే కల్యాణ మహోత్సవానికి టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి దామోదర రాజనర్సింహ, సీనియర్ నాయకులు షబ్బీర్ అలీ, ఎంపీ సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డిని ఆలయ ధర్మకర్త , కేంద్ర ఎఫ్‌సీఐ మాజీ డైరెక్టర్, డాక్టర్ విగ్రామ్ శ్రీనివాస్‌గౌడ్ హైదరాబాద్‌లోని వారి నివాసాల్లో కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు. కార్యక్రమంలో విగ్రామ్ అనీశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ**

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలంలోని జప్తిశివనూర్‌లోని సరోజినీనగర్‌కు చెందిన మేకల కృష్ణకు కాంగ్రెస్ నాయకులు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందించారు. మాజీ సర్పంచ్ షేక్ షీరఫ్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు చాంద్‌పాషా, రుక్మోద్దీన్, చందు, సాయి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

◆ **దరఖాస్తు పత్రాలు అందజేయాలి**

శివ్వంపేట(నర్సాపూర్): రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా ఉపాధి రుణాలు పొందేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు అందుకు సంబంధించిన పత్రాలను ఎంపీడీఓ కార్యాలయంలో సమర్పించాలని జూనియర్ అసిస్టెంట్ స్వామి సోమవారం తెలిపారు. మండల వ్యాప్తంగా 1,757 మంది దరఖాస్తు చేసుకున్నారని, అయితే 1,050 మంది మాత్రమే వాటికి సంబంధించి పత్రాలను తమకు అందజేశారన్నారు. మిగితా వారు కూడా త్వరగా సమర్పించాలని కోరారు.

◆ **బాలికల సాఫ్ట్ బాల్ జట్టు ఎంపిక**

తూప్రాన్: మే 2నుంచి 4 వరకు జగిత్యాల జిల్లా కేంద్రంలో జరిగే 11వ రాష్ట్ర స్థాయి జూనియర్ సాఫ్ట్ బాల్ బాలికల చాంపియన్ షిప్‌లో పాల్గొనే మెదక్ జిల్లా బాలికల జట్టు ఎంపిక ఈ నెల 30వ తేదీన మనోహరాబాద్ మండల కేంద్రంలోని తెలంగాణ క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు కొడిప్యాక నారాయణ గుప్తా సోమవారం తెలిపారు. ఎంపికలో పాల్గొనే బాలికలు 01.01.2008 తర్వాత పుట్టిన వారు అర్హులని పేర్కొన్నారు. అర్హత కలిగిన క్రీడాకారులు తమ ఆధార్ కార్డ్ లేదా జన్మదిన ధృవ పత్రంతో 30న ఉదయం 8 గంటలకు మైదానంలో రిపోర్ట్ చేయాలని సూచించారు. వివరాలకు గోవర్ధన్‌గౌడ్ 81065 55942 లో సంప్రదించాలని సూచించారు.

◆ **హౌస్ వైరింగ్‌లో ఉచిత శిక్షణ**

మెదక్ కలెక్టరేట్: గ్రామీణ ప్రాంతాల్లోని పురుషులకు స్వయం ఉపాధి కల్పనలో భాగంగా హౌస్ వైరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి కల్పన శిక్షణ కేంద్రం డైరెక్టర్ వంగా రాజేంద్ర ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45 ఏళ్ల వయస్సుతోపాటు తెల్ల రేషన్‌కార్డు కలిగి ఉన్న వారు శిక్షణకు అర్హులు. మే 8 నుంచి శిక్షణ ప్రారంభించనున్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు సమాచారం కోసం 97044 46956 నంబర్లను సంప్రదించాలని సూచించారు. వసతితోపాటు భోజనం, శిక్షణ అనంతరం హౌస్‌వైరింగ్ కిట్టు ఉచితంగా అందిస్తారు.

◆ **కొనుగోలు కేంద్రాలతో రైతులకు లబ్ధి**

రామాయంపేట(మెదక్): రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సహకార సంఘం అధ్యక్షుడు బాదె చంద్రం పేర్కొన్నారు. సోమవారం స్థానిక దళితవాడలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించొద్దని సూచించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి కనీస మద్దతు ధర పొందాలని సూచించారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. లక్ష్మణ్
9502735264